క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న మండల విద్యాధికారి పురందాస్

చేవెళ్ల: విద్యార్థులకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు అందజేస్తున్నామని మండల విద్యాధికారి ఎల్.పురందాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు పుస్తకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 24 వేలకుపైగా పాఠ్యపుస్తకాలు వచ్చాయని.. మరో రెండు రోజుల్లో పూర్తిగా వస్తాయని వివరించారు.

'లంపిస్కిన్'ను అరికట్టేందుకు టీకా

పశువైద్యాధికారి దేవి రెడ్డి

మొయినాబాద్ రూరల్: లంపిస్కిన్ వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం ఉచితంగా టీకా వేస్తోందని అమ్డాపూర్ పశువైద్యాధికారి దేవి రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె గ్రామంలో పలు పశువులకు టీకా ఇచ్చారు. ఈ సందర్భంగా దేవి రెడ్డి మాట్లాడుతూ.. పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాలదిగుబడి పెరుగుతుందని.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీసీ సేన మహిళా కోశాధికారిగా సునీత

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాలలో జాతీయ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జలజ ఆధ్వర్యంలో శుక్రవారం బీసీసేన మహిళా విభాగం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీసీసేన మండల మహిళా కమిటీ కోశాధికారిగా విఠ్యాలకు చెందిన సునీతను ఎంపిక చేశారు. అనంతరం ఆమెకు నియమాక పత్రం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శివ, చంద్రశేఖరప్ప, జయ శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రవంతిరాజ్, వెంకటేష్, రాజు, నర్సింలు, రాములు, యాదయ్య, విష్ణు, శ్రీశైలం, రాములు యాదవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో తిరంగా యాత్ర

కేశంపేట: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ నాయకులు తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు జాతీయ జెండాలతో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, రఘురాంగౌడ్, రాధిక, నరేందర్ రెడ్డి, శివాజీ, మహేష్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన పలువురికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. దీంతో గ్రామస్తుల సహకారంతో ఇంటి నిర్మాణాలకు లబ్ధిదారులు భూమి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుందరయ్య, నర్సింలు, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌జీ, రాంచంద్రయ్య, రాఘవేందర్, అంజనేయులు, దేవేందర్, మహిళ కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు రాణి, శివనాంద్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

కొందుర్గు: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన టేకులపల్లి, పర్వతాపూర్, చిన్నఎల్కిచర్లలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. పేదలకు దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మంజూరవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, నర్సింహారెడ్డి, రాములు, పైల్వాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

కొత్తూరు: క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తే యువత, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మె సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎర్ర శ్రీకాంత్, జామకాయల శివ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యం పెంచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, జంగయ్య, కృష్ణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



నందిగామ: అప్పారెడ్డిగూడలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్



చేవెళ్ల: ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

- రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: బీఆర్ఎస్ తీసుకువచ్చిన ధరణితో భూ సమస్యలు పుట్టుకొచ్చాయని.. ధరణితో కేవలం కల్వకుంట్ల కుటుంబమే బాగుపడిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. శుక్రవారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సమస్యల తీవ్రత ఆధారంగా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ తదితరులు నిర్ణీత సమయంలో సమస్యలకు పరిష్కారం చూపుతారని వివరించారు. అనంతరం రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, జగదీశ్వరప్ప, సురేశ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, సీతారాం రైతులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మండల పరిధిలోని శ్రీనివాసులు గూడలో హనుమాన్ దేవాలయం ఎదుట ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చంద్రారెడ్డి, నవీన్, శేఖర్‌రెడ్డి, బస్వం, శ్రీకాంత్,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్లాస్‌ఖాన్‌పేటలో 19.. సంతాపూర్‌లో ఆరు..

కేశంపేట: భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవానలి తహసీల్దార్ అజాం అలీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, సంతాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. సంతాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ అజాంఅలీ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్లాస్‌ఖాన్‌పేటలో 19, సంతాపూర్‌లో ఆరు దరఖాస్తులు వచ్చినట్టు ఆయన వివరించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో నాయబ్ తహసీల్దార్ గీత, ఆర్ఐలు నివేదిత, చేన్నకేశవులు, సంతాపూర్ మాజీ సర్పంచ్ అంజయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల వినతి

షాద్‌నగర్ రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ పార్థసారథి అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్, కడియాల కుంటతండా, తిమ్మాజీపల్లి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో భూసమస్యలపై రైతులు దరఖాస్తులు ఇచ్చారు.

పట్టాభూములుగా మార్చాలని మొర

మండల పరిధిలోని కడియాల కుంటతండా శివారులోని పట్టాభూములు సీలింగ్ భూములుగా మారాయని తిరిగి పట్టాభూములుగా మార్చాలని శుక్రవారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు నాయబ్ తహసీల్దార్ ఆనంద్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు శ్రీను నాయక్ మాట్లాడుతూ.. గ్రామ శివారులో సుమారుగా వంద ఎకరాలకు పైగా పట్టాభూములను గత రెవెన్యూ అధికారులు సీలింగ్ భూములుగా మార్చారని అన్నారు. పట్టాభూములుగా సరిచేసుకునేందుకు ఎన్ని సార్లు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదని అయన అన్నారు. ఈ సీలింగ్ భూముల రికార్డులను పరిశీలించి తిరిగి పట్టాభూములుగా మార్చాలని అయన డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సేవ్యానాయక్, తార్యాసింగ్, సందీప్, రాజు, రమేశ్, గోపి, రవీందర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల మున్సిపల్ పరిధిలో..

చేవెళ్ల: భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. తహసీల్దార్ కృష్ణయ్య, నాయబ్ తహసీల్దార్ రాజేందర్ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని చేవెళ్ల, ఇబ్రహీంపల్లి, కౌకుంట్ల గ్రామాల్లో శుక్రవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.

రైతుల వద్దకే అధికారులు

మొయినాబాద్‌రూరల్: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తహసీల్దార్ గౌతమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నమంగళారంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్ నిర్వహించిన సదస్సులో 70 ఫిర్యాదులు అందాయి. చాకలిగూడలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్ నిర్వహించిన సదస్సులో 30 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూ సమస్యలు పరిష్కారానికి అధికారులే నేరుగా గ్రామాలకు వస్తున్నారని వివరించారు. దరఖాస్తులను స్వీకరించి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేందర్, ఏఈఓ సునీల్‌కుమార్, మహేందర్‌యాదవ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను విధిగా బడిలో చేర్పించాలి

బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

షాద్‌నగర్: బడి బయట ఉన్న పిల్లలను తల్లిదండ్రులు విధిగా బడిలో చేర్పించాలని హెచ్‌ఎం సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి, ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పిస్తుందని వివరించారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఇమ్మాన్యుయేల్, పంచాయతీ కార్యదర్శి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

షాద్‌నగర్ రూరల్: మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే వారికి నాణ్యమైన విద్యను అందజేస్తామని మండల విద్యాధికారి మనోహర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నేరళ్లచేర్వు గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్‌ఎం సురేష్‌కుమార్, కృష్ణలతో కలిసి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్య, ఉపాధ్యాయులు చంద్రకళ, పర్ణీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి భవిష్యత్ అందించాలి

కొందుర్గు: బడి ఈడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించాలని చౌదరిగూడ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సునీత సూచించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన పేరెంట్స్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకొని విద్యార్థులను ఉన్నత చదువులు చదివించి, మంచి భవిష్యత్ అందించాలని అన్నారు.

సర్కార్ పాఠశాలల్లోనే చక్కని బోధన

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులుంటారని ప్రతీ ఒక్కరు తమ పిల్లలను సర్కార్ పాఠశాలల్లోనే చేర్పించాలని శంకర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయ బృందం పేర్కొంది. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలోని గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు కృషి చేయాలని మండల విద్యాధికారి పురందాస్ అన్నారు. మండల పరిధిలోని ఊరేళ్లలో శుక్రవారం బడిబాట కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్‌ను అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి

కేశంపేట: పాఠశాల పునఃప్రారంభం నాటికి పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో పాఠశాలల పునఃప్రారంభం నాటికి పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలను గుర్తించి పరిష్కారించాలని అన్నారు. పాఠశాలల్లో టేబుళ్లు, కుర్చీలు శుభ్రం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, విద్యుత్ ఏఈ ఈశ్వర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ మండల ఇన్‌చార్జి మల్లారెడ్డి

కొందుర్గు: స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి మల్లారెడ్డి సూచించారు. శుక్రవారం బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నాయకులు సోల్కర్ రెడ్డి, లక్ష్మయ్యగౌడ్, శివారెడ్డి, శ్రీశైలం, సత్యనారాయణ, బల్వంత్‌రెడ్డి, ప్రశాంత్, కురుమయ్య, అశోక్, ప్రభులింగం, రవి, కార్తీక్ పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవం

షాబాద్: మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠాప వార్షికోత్సవాలు గ్రామస్తులు వైభంగా నిర్వహించారు. శ్రీను పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనమెత్తి ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయికి నైవేద్యం సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమ్మలి సుబ్రమణ్వేశ్వరి, రవీందర్, జెడ్పీటీసీ మాజీ జడల లక్ష్మీ రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అశోక్, నాయకులు రవీందర్, రాహుల్‌గుప్తా, గ్రామస్తులు తదితరులున్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న గ్రామస్తులు

సమ్మర్ క్యాంపు ముగింపు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

షాద్‌నగర్: షాద్‌నగర్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జట్టుకు నిర్వాహకులు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కోచ్‌లు డేవిడ్, మతిన్, రంజిత్, మురళీకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కొందుర్గు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్మార్త ఏకాదశి సందర్భంగా పూజారి రాజేశ్వరస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింలు గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ స్కూల్ డే

మొయినాబాద్‌రూరల్: ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య అభ్యసించేలా తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని చాకలిగూడ అంగన్‌వాడీ టీచర్ శివలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి అనుబంధ గ్రామం చాకలిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లు నిండిన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గర్భిణులకు సీమంతం చేశారు.



మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్ శివలక్ష్మి

నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం



షాబాద్: చందనవెల్లిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శిరీష



చేవెళ్ల: ఖానాపూర్ రైతు వేదికలో..

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రమీల

చేవెళ్ల: రైతులు సరైన సాగు పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించి వచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.ప్రమీల, డాక్టర్ వి.రమ్య, డాక్టర్ వి.కవితాకిరణ్, సీహెచ్.స్నేహలత అన్నారు. మండల పరిధిలోని ఖానాపూర్, ఇబ్రహీంపల్లి గ్రామాల్లో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో రైతులకు కావాల్సిన సలహాలను, సూచనలు అందజేశారు. నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండల ఏఓ శంకర్‌లాల్, ఏఈఓలు రమ్య, ప్రతిభ, పంచాయతీకార్యదర్శి భాస్కర్, హెచ్‌ఎం వెంకటయ్య, రైతులు మల్లారెడ్డి, అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

అధిక దిగుబడులు

నందిగామ: మార్కెట్‌లో లభించే నకిలీ విత్తనాలపై రైతాంగం అప్రమత్తంగా ఉండాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం సూచించారు. మండల పరిధిలోని వెంకమ్మగూడలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ బలరాం రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. యూరియాను వీలైనంత తక్కువగా ఉపయోగించుకోవాలని, పంట మార్పిడి చేపట్టాలని సూచించారు. భాస్వరపు ఎరువులను అడుగుమందుగానే వాడాలని సూచించారు. రైతులు ఎక్కువగా నకిలీ బీటీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోతున్నారని.. ప్రభుత్వ లైసెన్సు ఉన్న డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసే సమయంలో రసీదులు తప్పక తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుకుమార్, వ్యవసాయ అధికారులు రామ శివరావు, డాక్టర్ స్నేహలత, ప్రజనిత, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి

మొయినాబాద్: రైతులు పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మాధవి, లీలారాణి అన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగు పద్ధతులు, భూసారం పెంపు, నీటి వనరులు, పర్యావరణ పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూరియా, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. తద్వారా భూమిలో భూసారం పెరిగి నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కూరగాయల పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, మల్చింగ్ పేపర్ వాడి నీటి వృథాను తగ్గించి కలుపు నివారించుకోవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, మాజీ సర్పంచ్ మాణయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మాధవరెడ్డి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సలహాలు, సూచనలు పాటించాలి

షాబాద్: రైతులు అవసరం మేరకే యూరియా, డీఏపీ ఎరువులను వాడాలని శాస్త్రవేత్తలు డాక్టర్ సతీశ్, శిరీష, శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ, చందనవెల్లి గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేతలు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సీనియర్ శాస్త్రవేత డాక్టర్ పి.సతీష్, డాక్టర్ డి.శిరీష, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... వ్యవసాయ ఆధారిత సలహాలు సూచనలు పాటించి సాగుచేపట్టాలన్నారు. మట్టి పరీక్షలు నిర్వహించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. పంటల సాగులో తీసుకోవలసిన సమగ్ర యాజమ్యానం, నీటి యాజమన్యం, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వర్సిటీ ఆధ్వర్యంలో రూపొందించిన సన్న రకాలు కేఎస్ఎం-1635, ఆర్ఎన్ఆర్-15048 వంటి సన్న విత్తనాలను పండించాలన్నారు. పత్తి, కంది పంటలలో వచ్చే చీడపీల గురించి వివరిస్తూ, పంట మార్పిడి పద్ధతిని పాటించాలని చెప్పారు. పంట కోతల తర్వాత జీలుగ వేసి దుక్కి చేయడం ద్వారా ఎరువుల వాడకం 50 శాతం వరకు తగ్గించొచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేష్, మండల వ్యవసాశాఖ అధికారి వెంకటేశం, ఏఈఓలు గీత, రాజేశ్వరి, రీసెర్చ్ స్కాలర్స్ అవనిజ, మిలింద్, పరిశోధన విద్యార్థి ప్రవీణ్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

షాద్‌నగర్: ప్రపంచ యోగా దినోత్సవానికి సంబంధించి ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. జూన్ 21న జాతీయ దినోత్సవంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షీలా, డాక్టర్ జయప్రకాష్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, నాయకులు తిరుపతిరెడ్డి, ఖదీర్, నర్సింలు, ఫార్మాసిస్టులు బాబు, చిన్మయరంగ, వరలక్ష్మి, ఈశ్వరి, యోగా శిక్షకుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల ఔదార్యం

షాబాద్: మండల పరిధిలోని పోతుగల్‌కు చెఇందని కృష్ణగుప్తా మే 29న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కృష్ణగుప్తాతో తాళ్లపల్లిలో 1997లో పదోతరగతి చదువుకున్న మిత్రులు శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.82,800 నగదు సాయం అందజేశారు.



సాయం అందజేస్తున్న మిత్రబృందం